
# మనసు మనసుకీ మధ్య-



రాజీవ్ నా మరిది. మా వారికీ, రాజీవ్‌కీ ఏ విషయంలోనూ పోలిక లేకపోవడం వల్ల ఇలా ఎవరికేనా పరిచయం చేస్తే కొంచెం ఆశ్చర్య పోవడం రివాజు. శ్రీకాంత్‌ది చామనచాయలో చురుకుతనానికి మారు పేరన్నట్టుండే శరీర మైతే, రాజీవ్ మంచి రంగుతో భావుకుల కుండే 'లీజర్లీ లుక్'తో కన్పిస్తాడు. అందం ఒకటే అతని ప్రత్యేకత కాదు. అతను భావుకుడు, కళాకారుడు కూడా. మంచి ఉద్యోగంలో వున్నాడు. ఇంకా పెళ్ళి కాలేదు కనుక ఒక్కమాటలో 'మంచి పెళ్ళికొడుకు' అని చెప్పచ్చు!

మా పెళ్ళయిన కొత్తలో ఒకసారి నేను ఒకర్తెనే పుట్టింటి నుంచి అత్తగారింటికి ప్రయాణం చేయాల్సివచ్చింది. అంతవరకు ఎపుడూ ఒంటరిగా దూరప్రయాణం చేసి వుండలేదు కనుక నాన్నగారు కొంత సంశయిస్తూనే, మా అత్తవారికి నేను ఒకర్తెనే ఫలానా రోజుకి హైదరాబాద్ వస్తున్నట్టుగా ఉత్తరం రాయించి, నన్ను ట్రైన్ ఎక్కించారు.

స్టేషన్‌లో నన్ను రిసీవ్ చేసుకోడానికి రాజీవ్ వచ్చాడు- మా వారికి వీలుకాకపోడం వల్ల. పెళ్ళిలో అతన్ని సరిగా చూడకపోవడం వల్ల, అతనూ పెళ్ళి టైమ్‌కి వచ్చివెంటనే వెళ్ళి పోవడం వల్ల అతన్ని నేను గుర్తుపట్టలేదు.

## 1986 దీపావళి కథల పోటీలో సాధారణ ప్రచురణకి ఎన్నికైన కథ

''రిసీవ్ చేసుకోడానికి ఎవరు వచ్చి వుంటారా?' అని ఆలోచిస్తూ ట్రైన్ దిగి, ప్లాట్ ఫామ్ మీద హడావుడిగా తిరుగుతున్న వాళ్ళని చూస్తూ నిలబడ్డాను. ఇంతలో ఎదురుగా ఒక్కో రైలుపెట్టె పరికించి చూస్తూ హడావుడిగా నేనున్న వైపుగా వస్తున్న రాజీవ్ కన్పించాడు.

చాలా ఆరోగ్యవంతమైన శరీరంతో తెల్లగా పొడుగ్గా కన్పిస్తున్న అతన్ని ఆ కొద్ది సమయంలోనే పరిశీలనగా చూశానేమో అతను ధరించిన దుస్తులు కూడా ఇప్పటికీ గుర్తుండిపోయాయి. నల్లని పాంట్ లోకి మెరూన్ కలర్ ఫుల్ హాండ్స్ షర్ట్ టక్ చేసుకుని చకచక నడుస్తున్న అతని రూపు నాకింకా గుర్తుంది. అతను హఠాత్తుగా నావైపు చూడడం, బాగా పరిచయస్తులని చూసినట్టుగా చూసి నావైపు నడుచుకు రావడం చూశాక అత్తవారివైపు బంధువు అయుండవచ్చని ఊహించాను. అతనితో నాకున్న బంధుత్వం ఇంటికి వచ్చేదాకా తెలియలేదు!

నేను గుర్తుపట్టక పోవడానికి అవకాశం వుందని అతను ఊహించలేదేమో, వస్తూనే నా రెండు సూట్ కేసుల వైపూ చూస్తూ 'వేరే లగేజ్ ఏమీ లేదు కదా?' అనడిగాడు. పలకరింపుగా ఓ నవ్వైనా లేదు! ఎవరో తెలీని అతనికి ఏం చెప్పాలో తెలియలేదు.

'లేదు' అని సంశయిస్తూ నిలబడ్డాను.

ఆ సూట్ కేసులు రెండు చేతుల్లోకి తీసుకుని 'పదండి, వెళ్దాం' అనేసి గబగబా జనాన్ని తప్పించు కుంటూ నడవసాగాడతను. వెనుకే వెళ్తున్న నాకు లక్ష సందేహాలు కలిగాయి. ఆపి, 'మీరెవరు' అని అడగా లంటే సంకోచం. అతనితో పాటు సమంగా నడవడానికి అష్టకష్టాలూ పడుతూ 'ఒక క్షణం ఆగండి' అన్నాను. అతనికి వినపడలేదు. నేను మరింత వేగంగా నడిచి అతన్ని చేరుకునేసరికి మేం స్టేషన్ బయటకు వచ్చేశాం. నా ప్రశ్న ఎలా అడగాలా అనుకుంటూ ఆ వాక్యం నిర్మించేలోపు అతను నా మొహం వైపు చూడకుండా 'మీ నాన్నగారు రాసిన ఉత్తరం ఇవాళే అందింది. ఇంకో రోజు ఆలస్యమయుంటే మీకు చాలా కష్టమయేది. శ్రీకాంత్ కి మీరు వస్తున్నట్టు తెలీదు'' అన్నాడు, ఆటో వైపు చెయ్యూపుతూ.

నేను మనసులో 'అమ్మయ్య!' అనుకుని, 'ఫర్వా లేదు, అడ్రస్, ఫోన్ నంబర్ నా దగ్గర వున్నాయి'' అన్నాను.

ఆటోలో ఇల్లు చేరాక అత్తగారు చెప్పారు- ఉత్తరం ఆలస్యంగా రావడం, సమయానికి రాజీవ్ ఇంట్లో వుండడం గురించి. నేను భయపడ్డ విషయం ఆవిడకి చెపితే ఆవిడ నవ్వడమే గాక, భోజనాల దగ్గిర అందరూ వుండగా ఆ విషయం చెప్పి నవ్వడం మొదలు పెట్టారు. కొన్ని రోజులపాటు అదో కామన్ జోక్ ఇంట్లో అందరికీ! నాలుగు రోజులుండి రాజీవ్ మెడ్రాస్ వెళ్ళిపోయాడు. అప్పట్లో అతనక్కడ ఒక హాస్పిటల్లో రెసిడెంట్ సర్జన్ గా పనిచేస్తుండేవాడు.

మళ్ళీ రెండు సంవత్సరాలకి అతనికి హైదరా బాదులో అసిస్టెంట్ సర్జన్ గా ఉద్యోగం వచ్చింది. అంతా కలిసే వుండేవాళ్ళం. ఉద్యోగం నిశ్చయమ యింది కనుక ఇంక పెళ్ళి చేసుకోవచ్చని తీర్మానించారు అందరూ! అతని అలవాట్లు, అభిరుచులు గమనించిన కొద్దీ అతని పట్ల ఒక విధమైన అభిమానం, గౌరవం పెరిగాయి నాలో. ఎక్కువ మాట్లేడేవాడు కాదు గాని 'హైలీ ఇమోషనల్'. ఏదో చదువుకుంటూ వుండేవాడు ఎప్పుడు చూసినా. ఎపుడేనా చిన్న చిన్న కవితలు రాసేవాడు. అవి దాచడం, ఏ పత్రికకేనా పంపడం లాంటివేమీ వుండేవి కావు. పనిమనిషి అతని గది



తుడిచినపుడు ఆ కాగితాలు బయట పడుతుండేవి. ఆ కాగితాలు మళ్ళీ కన్పడకపోయినా అతనికి పట్టింపు వుండేది కాదు. ఒకసారి పనిమనిషి బుట్టలోకెత్తుతున్న చెత్తలో ఒక కవిత కన్పించి తీశాను. 'మానసి' శీర్షికతో ఆ కవిత-

మంచు ముసుగు ధరించిన సుమవనితను కదిపిచూడు,
రాలుతుంది నీటిబొట్టు!
హిమపు సోయగానికే
సుమపు సౌరభానికీ
చలించిపోయే మానసాన్ని కెలికి చూడు,
కారుతుంది కన్నీటి బొట్టు!

చిన్న చిన్న విషయాలకే త్వరగా 'హర్ట్' అయిపోయే నాకు ఆ కవిత ఎంతగానో నచ్చింది. నిజమే! ప్రకృతిలో ప్రతి చిన్న అందానికీ స్పందించే మనసు గాయపడేందుకు ఒక కఠినమైన మాట చాలు! ఆ రోజు శ్రీకాంత్ రాగానే ఇద్దరం బాల్కనీలో కూర్చుని కాఫీ తాగుతుండగా ఆ కాగితం తనకి చూపించాను. చదివి, నవ్వి వూరుకున్నారు. తన తత్త్వమే అంత.

"అదేమిటి? ఎలా వుందో చెప్పండి" అన్నాను.

"కళ్ళ రెప్పల్లో కన్నీళ్ళు రెడీగా పెట్టుకుంటారే కొంత మంది... వాళ్ళ గురించి రాశాడు" అన్నారు (నన్ను ఉద్దేశించి) నవ్వుతూ.

నేను ఉత్తుత్తి కోపం ప్రదర్శిస్తూ "అందరూ మీలా వుంటారేమిటి, మిన్ను విరిగి మీద పడ్డా చలనం లేకుండా 'అన్ ఇమోషనల్'గా" అన్నాను.

"నేనిలా వుండడమే నీ కిష్టం అని నీవు ఎప్పుడో చెప్పినట్టు గుర్తు" అన్నారు గుర్తు తెచ్చుకుంటున్నట్టు సీరియస్‌గా ఫోజు పెట్టి.

నేను నవ్వాను. నిజమే, భిన్నత్వం వల్లే ఆకర్షణ కలుగుతుందేమో, ఒకే విధమైన తత్త్వాలు ఆత్మీయతను కలుగ జేస్తాయేమోగాని, ఆకర్షణ పుట్టించలేవు! రాజీవ్ మనస్తత్వానికీ, నా తీరుకీ చాలా పోలిక వుంది. అతను కూడా నాలాగే అందమైన సూర్యాస్తమయ దృశ్యాలు చూసినపుడూ, మంచి నవల చదివినపుడూ చలించిపోతాడు! ఇతనికి మంచి పిల్లను వెదకాలి అనుకోవడమే

## ఆరాధన


స్నిగ్ధ సౌందర్యమోహన సిరివి నీవు
మధుర మంజులమైనట్టి మాట నీది
మాట మాటకు మకరంద తేటలొల్కు
భాషణంబులు నీకవే భూషణములు
ధనువు దలపించు కనుబొమల్ దర్పమైన
గమన మందున రాయంచగమన నీవు
భావపూరిత విన్యాసభరిత నాట్య
లయలు నీ నడకందున హొయలు చిలుకు
నీదు పాద మంజీరాల నాద మెపుడు
నాకు సుప్రభాతంబును వేకువందు
నీదు చల్లని చూపులు నాదు హృదయ
మందు కలిగించు వింతనౌ స్పందనంబు
కలువరేకుల వంటి నీ కన్నులందు
నాదు రూపమ్ము గాంచి యానందమంద
మెత్తనైనట్టి చేతుల నెత్తి నాదు
కంఠమున వేయ నీలోన కరగిపోదు
నిన్ను జూచితి మరచితి నన్ను నేను
కుదురుగా నుండు నీలి ముంగురులదాన
నీదు సిగలోన పూవునై నిలిచిపోని
నీదు ఒడిలోన ఒకతూరి నిదురబోని

—యెర్రబెల్లి రామచందర్ రావు

గాని, ఇతనిలో నేనింతగా మెచ్చుకునే గుణాలేవీ శ్రీకాంత్‌లో లేకపోవడం నాకెపుడూ లోటుగాఅన్పించ లేదు! మనసులో అనిపించినవన్నీ శ్రీకాంత్‌కి చెప్పడం అలవాటైపోయి "అతన్ని చూసినప్పుడల్లా అతనికోమంచి పెళ్ళికూతుర్ని వెతికి పెట్టాలనిపిస్తుంది" అన్నాను.

శ్రీకాంత్ మళ్ళీ నవ్వి, "నాలాంటి వాడనుకున్నావా వాడు? అమ్మో, అమ్మమ్మో వెతికిపెట్టే సుబ్బలక్ష్మిని చేసుకోడానికి?!" అన్నారు.

నాకొక్కసారి చివుక్కుమన్పించింది. నా మొహం చూస్తూనే "ఏదీ ఆ కవిత?? మంచు ముసుగు




వేసుకున్న పువ్వు రాణిని అడిగి చూడు" లయ బద్ధంగా అంటూ, కంగారుగా ఆ కాగితం కోసం వెతుకుతున్నట్టు నటించారు. నాకు నవ్వు వచ్చింది గాని పక్కకు నెట్టేసి, "అన్నిటినీ బాగానే అపహాస్యం చేస్తారుగాని మీకు నేనింతగా నచ్చలేదని నాకెపుడూ చెప్పలేదేం?" అన్నాను.

"నువు నాకు నచ్చలేదని ఎవరన్నారు? వాడికేం కావాలో నీకు తెలీదన్నాను గాని" అన్నారు.

"మరి అమ్మమ్మ చూసిన సుబ్బలక్ష్మి అనెందుకనాలి?" అన్నాను ఉక్రోషంగా.

"పలుకు దోషం... అమ్మ ఎన్నికచేసిన సరళవు నువ్వు. అమ్మకి నాకేం కావాలో తెలుసు కనుక సరిగ్గా అలాంటి అమ్మాయినే చూసిపెట్టింది నాకోసం" అన్నారు ఇంకా నవ్వుతూ.

నేనేం మాట్లాడలేదు.

"ఆమె కోపంలో నేను
మసిబారిపోతాను
ఆమె కోపాగ్నికి నేను
మాడి మసై పోతాను"

నవ్వు దాచుకుంటూ ఆశువుగా కవిత చెప్పారు. ఆధునిక కవితల్ని అలాగే వెక్కిరించడం ఆయనకి అలవాటు. నాక్కూడా నవ్వొచ్చింది. తను కూడా నవ్వేసి, "వాడికెలాంటి అమ్మాయి కావాలో విన్నావా? సంగీతంలో, నాట్యంలో, శిల్పకళలో, చిత్రలేఖనంలో, కవిత్వంలో ప్రావీణ్యత వుండాలిట. అలాంటి అమ్మాయినెక్కడైనా చూశావా?" అనడిగారు. అతిశయోక్తులూ, అపహాస్యాలూ ఆయన సంభాషణలో భాగాలు కనుక.

"మరీ చెప్పకండి. మీ మాట తీరు నాకు తెలీదేమిటి?" అన్నాను.

ఈ మాటు సీరియస్‌గా చూస్తూ "నిజం సరళా! సంగీతం బాగా వచ్చి వుండాలట, ఫైనార్ట్స్‌లో అభిరుచి వుంటే మంచిదట! ఇంకోటి విను. ఇంగ్లీష్ ఎం.ఎ. అయి వుండాలిట!! పోస్ట్ గ్రాడ్యుయేట్ కావాలని అడిగిన వాళ్లని చూశాను. 'పొలిటికల్ సైన్స్‌లో ఎమ్మే అయుండాలి', 'ఇనార్గానిక్ కెమిస్ట్రీలో ఎమ్మెస్సీ' అయుండాలని అడిగిన వాళ్ళనింతవరకు చూడలేదు" అన్నారు.

కాబోయే భార్య గురించి రాజీవ్‌కి వున్న నిశ్చితాభిప్రాయాలకీ, అతనంత స్పష్టంగా చెప్పిన తీరుకీ నేనాశ్చర్యపోయాను.

తెలిసిన వాళ్ళు చాలామంది రాజీవ్ కెన్నో సంబంధాలు చెప్పడం మొదలు పెట్టారు. ఒకరోజు ఏదో పెళ్ళికి వెళ్తే అక్కడ మా దూరపు బంధువు శారద పిన్ని కన్పించింది. మాటల సందర్భంలో ఆవిడ వాళ్ళమ్మాయి గురించి చెపుతూ, "మీ మరిదికి ఇంకా పెళ్ళికాలేదని విన్నాను. మా అమ్మాయికేమన్నా కుదురుతుందంటావా?" అనడిగింది. నాకేమనాలో తోచలేదు. నిజానికి వాళ్ళమ్మాయి వసంత నాకు బాగానే తెలుసు. పెద్ద అందమైనది కాకపోయినా కళగల మొహం. కలుపుగోరు మనస్తత్వం, మంచి అమ్మాయి. కానీ రాజీవ్ కోరికలు గుర్తు వచ్చి, "ఏం చెప్పాలో తెలీటం లేదు



# అమర్ ఖయాం

అక్కట ! మేను డస్సె; మొగమా జిగి తప్పెను; ప్రొద్దు వాలె; నీ
వెక్కడి కేగెదో తెరువరీ! క్షణ మాగుము; మా కుటీరమం
దిక్కడ సేద దీర్చుకొను మించుకసేపు; భవన్నివాస మే
దిక్కున నున్నదో! బయలుదేరిన దెప్పుడొ! గమ్య మెద్దియో!

అందము డెందమున్ నులిమి హత్య యొనర్చెడి మొండిదున్న కా
నందము బండిసున్న; కరుణారస ముందునె రాతి గుండెలో?
మంద మరుత్కుమార సుకుమార సుగంధ రసార్ద్ర హార్దిక
స్పందనమున్ గణించునె భుజంగ విభుండు క్షుధావ్యథాక్రుధన్?

వచ్చిన పాత మిత్రునకు వాకిటి జంటగులాబి గుత్తు లం
దిచ్చి నవాసవంబు గొనితెచ్చు నిమిత్తము లోనికేగి నే
వచ్చెదు నంతలో-నమిలివైచెను వాడు గులాబి పువ్వులన్;
మచ్చిక దక్కి వట్టి తొడిమల్ పడియున్నవి ముందు బల్లపై.

డాక్టర్ కరుణశ్రీ "అమర్ ఖయామ్" పద్యకావ్యం నుంచి

పిన్నీ! అతని కోరికలన్నీ తమాషాగా వున్నాయి. సంగీతం బాగా వచ్చి, మిగిలిన ఫైనార్ట్స్‌లో అభిరుచి వున్న అమ్మాయి కావాలిట. ఇంగ్లీష్ ఎమ్మే అయువుండాలిట. అలాంటివేవో కొన్ని ఖచ్చితమైన అభిప్రాయాలున్నాయి అతనికి. పైగా ఇలా సంబంధాలు చూసి, పెళ్ళి చూపులు చూసి చేసుకోడుట. ఆ అమ్మాయి ఎపుడో అతనికి తారసపడితే, ఇద్దరికీ కుదిరితే పెళ్ళి చేసుకుంటాడు." అని రాజీవ్ అభిప్రాయాలు నా భాషలో చెప్పాను.

"అలాగా?" అంది పిన్ని తెల్లబోతూ.

తిరిగి వచ్చేసే ముందు "పోనీ ఒక్కసారి చూసి వెళ్ళడంలో తప్పేముంది? చూశాక నచ్చకపోతే పోనీ... మా అమ్మాయి కూడా ఇంగ్లీష్ ఎమ్మే చేసింది కదా. ఒకవేళ కుదురుతుందేమో ఏం చెప్పగలం?" అందావిడ.

"అలాగేలే పిన్ని. మా అత్తగారితో చెప్తాను" అన్నాను.

"తర్వాత అత్తగారితో ఈ విషయం చెప్పాను రాజీవ్ కూడా ఉన్నప్పుడు. చూడడం నచ్చలేదని ఆ అమ్మాయిని బాధ పెట్టడం ఎందుకమ్మా, ఎలాగూ చేసుకునే ఉద్దేశ్యం లేనప్పుడు" అన్నాడతను అయిష్టంగా.

అత్తగారికి చూసి చూసి చాలా కోపం వచ్చినట్టుంది. "రాజా! ఇలా వచ్చిన సంబంధాలు చూడవు. పొద్దున్నంచి రాత్రి దాకా హాస్పటల్లో పేషంట్ల మధ్యనూ, మిగిలిన టైమంతా పుస్తకాల మధ్యనూ గడిపే నీకు ఎప్పుడురా నచ్చే అమ్మాయి కన్పించేది? అర్థం లేకుండా


త్వరలో జ్యోతి కామిక్స్‌లో

'పరమ లవ్' కామిక్స్

'నా మొగుడు!
నా పెళ్ళాం!'

కథ: పావని, బొమ్మలు: పావి


మాట్లాడకు. నీకు నచ్చని సంబంధం కుదిర్చేసి, 'చేసుకుంటావా? చస్తావా?' అనడగడం లేదుగా? ఆ అమ్మాయి కూడా ఇంగ్లీషు ఎమ్మే చేసిందట. చక్కని పిల్ల అని సరళ చెబుతోంది. నీలాంటి వాళ్ళే వంద కబుర్లు చెప్పి, దేనికీ పొంతన లేని విధంగా పెళ్ళిళ్ళు చేసుకోవడం నేనెరుగుదును. ఒకసారి చూసిరా. నీ కోరికలన్నీ తెలిసే వాళ్ళు ఒకసారి చూసి వెళ్ళమని అడిగారు కదా" అన్నారు. శ్రీకాంత్ లాగే ఆవిడకీ కోపం రావడం అరుదు. ఆవిడ తీరుకి భిన్నంగా అలా అనేసరికి రాజీవ్ అయిష్టంగానే ఒప్పుకున్నాడు.

తరువాతి వారం అత్తగారు, మామగారు, నేను రాజీవ్‌తో టాక్సీలో బయల్దేరాం 'పెళ్ళి చూపుల'కి. వెనకసీట్లో అత్తగారికి ఒకవైపు రాజీవ్, మరోవైపు నేను. రాజీవ్ చిన్నపిల్లవాడిలా అయిష్టంగా మొహం పెట్టుకుని, విండో లోంచి బయటకు చూస్తూ కూర్చుని వుంటే నాకు నవ్వు వచ్చింది.

'అయ్యో పాపం!' అని కూడా అన్పించింది. నిజమే మరి, చూసొచ్చి నచ్చలేదని చెప్పాలంటే అతనికీ కష్టమే, ఆ అమ్మాయి ఎంత నచ్చకపోయినా.

కారు శారద పిన్ని ఇల్లు చేరింది. ఏరోజు వస్తామో తెలియని శారద పిన్ని, వసంత ముందు గదిలో వున్నారు. పిన్ని బియ్యం ఏరుతూ వుంది. వసంత చేతిలో ఏదో పుస్తకం. మమ్మల్ని చూస్తూనే పిన్ని చాలా హడావుడి పడిపోయింది. రండి రండి' అంటూనే బియ్యం చేట లోపల పెట్టడానికి వెళ్ళింది. చదువుతున్న పుస్తకం టేబిల్ మీద పెట్టి, వసంత ఏం చేయాలో తోచని దానిలా నిల్చుని ఉండి పోయింది. మామూలు నేత చీర పొద్దుట నుంచి కట్టుకుని ఉండడం వల్ల కొంచెం నలిగి వుంది. ఊహించని రాక కావడం వల్ల "చూడు... ఎలా చేశావో" అన్నట్టు నా వైపు ఫిర్యాదు చేస్తున్నట్టు చూసింది. నేను నవ్వి, అత్తగారిని, మామగారిని, రాజీవ్‌ని కూర్చోమని చెప్పి వసంతని పరిచయం చేశాను. తర్వాత హడావుడి మామూలే. కాఫీలూ, బిస్కెట్లూ అయ్యాక రాజీవ్ ఎలాంటి సంకోచం లేకుండా వసంతతో మాట్లాడాడు. తన వివరాలు చెప్పాడు. ఆమె గురించేవో మామూలు ప్రశ్నలు వేశాడు. ఆమె చదువుకున్న సబ్జక్ట్స్ గురించి 'ఎక్స్‌ట్రా కరికులర్ యాక్టివిటీస్' గురించి ఎంతో పొలైట్‌గా . ఈ పెళ్ళి చూపుల పట్ల అతను కనపరిచిన అయిష్టతకీ! అతని ప్రవర్తనకూ ఎంతో తేడా కన్పించింది.

చివరికి 'యూ హావిన్ట్ ఆస్క్‌డ్ మి ఎనీథింగ్?' అని రాజీవ్ అనగానే, చిన్నగా నవ్వింది వసంత. ఆమె 'సింప్లిసిటీ' అంతా ఆ నవ్వులో కన్పించింది "అన్నీ మీరే చెప్పారు కదా" అంది తెలుగులో.

అత్తగారు నవ్వారు. అందరం నవ్వాము. చివరికి శారద పిన్ని కుంకుమ భరిణె కోసం వంటింట్లోకి వెళ్తే ఆవిడ వెనకే నేనూ వెళ్ళాను. "ఏమమ్మా సరళా! ఇవాళొద్దామనుకుంటున్నట్టు ఒక్క కబురు తెలియజేస్తే ఏం పోయింది? దానికి ఓ ముస్తాబు లేదు, ఏం లేదు. తర్వాతేనా కాస్త మొహం కడుక్కుని, చీర మార్చుకోవే అంటే ఎలాగూ చూసేశారు కదమ్మా అంది తప్పితే

మొహం కూడా కడుక్కోలేదు వసంత అంది.

"ఏం చేయను పిన్నీ... అనుకోకుండా రాజీవ్ మాడడానికి ఒప్పుకున్నాడు. వెంటనే బయల్దేరారు" అన్నాను.

మేం తిరిగి కారెక్కబోతుంటే పిన్నీ, వసంతా మా వెంట వచ్చారు గేటుదాకా. వెళ్ళొస్తామని చెప్పి అత్తగారు వెనకసీట్లోకి, మామగారు ముందు సీట్లోకి ఎక్కుతుండగా రాజీవ్ వెనక్కి చూశాడు. రాజీవ్ తన వైపు చూడగానే వసంత సంకోచంగా చెయ్యి కొద్దిగా ఎత్తి అటూ ఇటూ వూపింది. దాని పెదవి చివర్ల చిన్న నవ్వు వర్షాకాలపు మేఘం చివర్లు సూర్యకిరణాలకి మెరిసినట్లనిపించింది! రాజీవ్ కూడా చెయ్యూపి కార్లో కూచున్నాడు. కారు కదిలింది. అంతా కావాలనే పెళ్ళికూతురు విషయం తప్పించి, వేరే విషయాలు మాట్లాడారు. ఇల్లు చేరాం. అత్తగారు ఆ విషయం ఎవాయిడ్ చేస్తున్నారని గమనించి, నేనూ ఏమీ అడగలేదు. రెండు రోజుల తర్వాత సాయంత్రం పూట నేను బాల్కనీలో కూర్చుని ఏదో మాగజైన్ పేజీలు తిప్పుతున్నాను. మధ్య పేజీలో చెయ్యూపుతూ 'బై బై' చెప్తున్నట్టున్న ఒకమ్మాయి రంగు ఫోటో. మనోహరంగా నవ్వుతోంది ఆ అమ్మాయి. వసంత గుర్తొచ్చింది.

ఆలోచిస్తూ వుండిపోయాను. తృప్తికరమైన వైవాహిక జీవితానికి, రాజీవ్ కోరుకుంటున్న అర్హతలకి సంబంధం లేదనిపించింది. వెనకగా రాజీవ్ కన్పించగానే, మరో కుర్చీలో కూర్చోమని పిలిచాను. కూర్చుంటూ నా చేతిలో పత్రిక గమనించి "మీరు చెప్పాక నా కవితలు కొన్ని పత్రికకి పంపించాను. ప్రతి వారం ఒకటి వేస్తామని రాశారు. దానిలో ఒకటి పడింది చూశారా?" అన్నాడు.

పత్రిక అతని కిచ్చాను. మధ్య పేజీ తెరిచి వుండగానే అతను కూడా ఆ బొమ్మ చూస్తూ ఉండిపోయాడు. "వసంతలా వుంది కదూ" అన్నాను. తలెత్తి నా వేపు చూసి ఠం పూపాడు ఒప్పుకున్నట్టు. రెండు మూడు పేజీలు తిప్పి తన కవిత వున్న పేజీ తీసి నాకిచ్చాడు.

'మనసు మనసుకి మధ్య' అనే శీర్షికతో
నీకూ నాకూ మధ్య అరడుగే ఎడం
అయినా నా మనసులో మోయలేని భారం
అవును మరి మానసికంగా నువ్వు నాకు
కొన్ని వేల యోజనాల దూరం!

"బావుంది" అన్నాను మెచ్చుకుంటూ. కొంత సేపాగి వసంత గురించి ఏం నిశ్చయించుకున్నావు? వాళ్ళా ఎదురు చూస్తూ వుంటారు కదా, నీ నిర్ణయం కోసం?' అన్నాను మెల్లిగా.

"ఈ రెండు రోజులుగా చాలా ఆలోచించాను... చాలా కన్ఫ్యూజింగ్‌గా అనిపించింది. ఐ థింక్... ఐ విల్లింగ్ టు మారీ హర్" అన్నాడు ఇంకా ఆలోచిస్తున్నట్టు.

"నిజంగా?" అన్నాను సంభ్రమంగా.

"నా నిర్ణయం మీకు సంతోషాన్ని కలిగించిన ట్టుందే" అన్నాడు.

"అవును మరి! సంతోషంతో పాటు ఆశ్చర్యం కూడా కలుగుతోంది. నీ నిశ్చితాభిప్రాయాలన్నీ ఏమై పోయాయి?" అన్నాను నవ్వుతూ.

చేతిలో పుస్తకం చుట్ట చుడుతూ ఆలోచనల్లో మునిగిన వాడిలా చెప్పాడు రాజీవ్ "ఫామిలీ లైఫ్ తృప్తిగా, ఆనందంగా సాగాలంటే ఇద్దరిలో రాజీపడే తత్వం వుండాలి అని నా ఉద్దేశ్యం. ఆ కవితలాగా మనసు మనసుకీ మధ్య దూరమే భయంకరమైనది. రాజీ గుణమే లేకపోతే సహజీవనమే లేదు. నేను మామూలుగా కారెక్కుతుంటే ఆ అమ్మాయి నవ్వుతూ చెయ్యూపడం... ఎందుకో చాలా ఇంప్రెస్ అయ్యాను! నార్మల్లీ సచ్ గెశ్చర్ ఈజ్ ఎక్స్‌పెక్టెడ్ ఫ్రమ్ మీ... బట్ షి డింట్ వాంటు వెయిటెండ్ సీ వెదర్ అయ్ వుడ్ డూ ఇట్! ఏదైనా చిన్న గొడవ వస్తే భార్యా భర్తలు ఎవరికి ఎక్కువ పట్టుదలో అప్పుడే నిరూపించ దల్చుకుంటారు! ఎందుకో ఆ అమ్మాయి అలాంటి ఫ్రిక్షన్ రాకుండా చేయగలదనిపించింది"

అతను వివరించి చెప్పిన తర్వాత నా ఆశ్చర్యం ఇంకా ఎక్కువైంది. వసంతలో అతనికి అన్నింటికన్నా నచ్చిన అంశం అదా? ఏది ఏమైతేనేం... అతని నిర్ణయం నాకు నచ్చింది. మనసులో వాళ్ళ జీవితం సుఖంగా సాగాలని కోరుకున్నాను. ●



హైదరాబాదు విశాలాంధ్ర ప్రచురణాలయంవారు మే 19వ తేదీన ఆవిష్కరించిన 'ఆంధ్రప్రదేశ్ దర్శిని' మొదటి ప్రతిని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావుకు సంపాదకుడు శ్రీ వై.వి. కృష్ణారావు బహూకరిస్తున్న దృశ్యం

## సూపర్ నోవా సృష్టించే సంక్షోభం!

భూమికి 17 వేల కాంతి సంవత్సరాల దూరంలో ఈ మధ్య నక్షత్ర విస్ఫోటం (సూపర్ నోవా) ఒకటి రికార్డయింది. దీని కాంతి సూర్య కాంతి కన్నా వంద మిలియన్ రెట్లు ఎక్కువ.

ఈ విస్ఫోటం ఫలితంగా భూ వాతావరణంలో ఎన్నో విపరీతాలు వస్తాయని, ముఖ్యంగా దక్షిణ ధృవ ప్రాంతంపై ఈ ప్రభావం మరీ ఎక్కువని ఇండోర్‌లోని హోల్కార్ సైన్స్ కాలేజి ఫిజిక్స్ ప్రొఫెసర్ శ్రీ రామ్ శ్రీవాస్తవ చెపుతున్నారు.

భూ వాతావరణపు చలనాల వల్ల 1968లో 210 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో మంచు వుండేది. ఇది 1977 నాటికి 260 లక్షలకు విస్తరించింది. ఇప్పుడు అంటే 1987 మే నెల నాటికి ఈ విస్తీర్ణం 320 లక్షల చదరపు కిలోమీటర్లు[illegible]

సూపర్ నోవా ఫలితంగా భూ[illegible] 'మంచు యుగం' లోకి ప్రవేశించే ప్రమాదం వుందని ఆయన హెచ్చరించారు.

ఉత్తర ధృవ ప్రాంతపు మంచు కరగకపోవడం వల్ల అక్కడి మంచుకొండలు క్రమంగా దక్షిణంవైపు కదులుతున్నాయి. ఫలితరగా వడగళ్ళ వానలు, మంచు జడులు ఎక్కువగా సంభవిస్తున్నాయట.

ఇక ఈ ఏడాది వాతావరణంలో వచ్చే విపరీత పరిణామాలు ఎలా వుంటాయో వేచి చూడాలి.